క్లుప్తంగా

'బండి'ని కలిసిన బీజేపీ నాయకులు



కేంద్ర సహాయ మంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న కరుణాకర్‌రెడ్డి

రామడుగు: కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడిగా గెలిచి కేంద్ర సహాయ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న బండి సంజయ్‌కుమార్‌ను ఆదివారం బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు ఒంటెల కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఢిల్లీలో మంత్రి కార్యాలయంలో కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కేంద్ర సహాయ మంత్రికి సన్మానం



బండి సంజయ్‌ను సన్మానిస్తున్న సుదర్శన్‌రెడ్డి

చొప్పదండి: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను బీజేపీ మండల అధ్యక్షుడు మావురం సుదర్శన్‌రెడ్డి ఆదివారం ఘనంగా సన్మానించారు. న్యూఢిల్లీలోని సంజయ్ కార్యాలయంలో పుష్పగుచ్ఛమందించి శాలువాతో సత్కరించారు.

మంత్రిని కలిసిన గోపాల్‌రావుపేట గ్రామస్తులు



పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందిస్తున్న గ్రామస్తులు

రామడుగు: గోపాల్‌రావుపేట గ్రామంలో శ్రీహనుమాన్ దేవాలయం పునర్నిర్మాణం చేయడానికి సహాయ సహకారాలను అందజేయాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను గ్రామస్తులు, యువజన సంఘాల ప్రతినిధులు ఆదివారం ఎల్కతుర్తిలో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. గ్రామంలో దేవాలయాలను అభివృద్ధి చేయడానికి గ్రామస్తులు ప్రయత్నం చేస్తుంటే.. గ్రామ మాజీ సర్పంచ్ కర్ర సత్యప్రసన్న ఇబ్బంది పెడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమస్య పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారని గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు తెలిపారు.

బాధిత కుటుంబానికి చేయూత



బియ్యం, నగదు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

గన్నేరువరం: ఖాసీంపేట గ్రామానికి చెందిన జక్కనపల్లి రాజమల్లు ఇటీవల ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతిచెందగా.. అతడి కుటుంబ సభ్యులను 1994–95 పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం పరామర్శించారు. 25 కిలోల బియ్యంతోపాటు రూ.5వేల నగదును అందజేశారు.

బీఫార్మసీ విద్యార్థినికి చేయూత



విద్యార్థినికి నగదు అందిస్తున్న విద్యా ఫౌండేషన్ సభ్యులు

చొప్పదండి: తల్లిదండ్రులను కోల్పోయి బీఫార్మసీ చదవడానికి ఆర్థిక స్తోమత లేక ఇబ్బందుల్లో ఉన్న పేదింటి విద్యార్థినికి చొప్పదండిలోని విద్యా ఫౌండేషన్ అండగా నిలిచింది. దాతల సాయంతో రూ.36వేలు సేకరించి హాస్టల్ ఫీజు చెల్లించేందుకు ముందుకొచ్చింది. ఆదివారం విద్యార్థినికి నగదును అందించారు. ఆర్నకొండకు చెందిన మ్యాకల ప్రవళిక అనే బీఫార్మసీ విద్యార్థిని రెండో సంవత్సరం చదువుతోంది. కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో పదోతరగతి చదివి 10జీపీఏ సాధించగా.. ఇంటర్‌లో 920 మార్కులు సాధించింది. ఎంసెట్‌లో 10వేల లోపు ర్యాంకుతో బీఫార్మసీ ఉచిత సీటు సాధించింది. హాస్టల్ సీటుకు డబ్బు లేక విద్యా ఫౌండేషన్ సభ్యులను సంప్రదించింది. సభ్యులు విద్యార్థిని ఇంటికెళ్లి విచారించి ఆర్థిక సాయం చేస్తామని హామీ ఇచ్చారు. రూ.36,155 దాతల నుంచి సేకరించి ఆదివారం ప్రవళికకు అందించారు. ఫౌండేషన్ చైర్మన్ పచ్చునూరి తిరుపతి, మ్యాకల రామకృష్ణ, పైడ మహేశ్, కటుకం నారాయణ, తాటిపెల్లి శివ, మహేశుని మల్లేశం, సామల వెంకటేశ్, వల్లాల జగన్, దాసరి మునిందర్ తదితరులు పాల్గొన్నారు.

సర్వమతాల సమ్మేళనానికి ప్రతీక

- నేటి నుంచి బిజిగిరిషరీఫ్ దర్గాలో ఉర్సు ఉత్సవాలు ప్రారంభం



దర్గా ముఖద్వారం కమాన్



దర్గాలోని హజ్రత్ సయ్యద్ ఇంకుషావళి సమాధులు



బిజిగిరిషరీఫ్‌లోని ప్రధాన దర్గా మందిరం

జమ్మికుంట: బిజిగిరిషరీఫ్ దర్గా సర్వమతాల సమ్మేళనానికి ప్రతీకగా నిలిచి హజ్రత్ సయ్యద్ ఇంకుషావళి దర్గాగా ప్రచుర్యంలో ఉంది. వందల ఏళ్ల నుంచి కులమతాలకు అతీతంగా, సామజిక వైషమ్యాలకు అతీతంగా ఉర్సు ఉత్సవాలు జరుగుతాయి. మూడు రోజులపాటు జరిగే ఉర్సు ఉత్సవాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఈనెల 17 నుంచి 19 వరకు నిర్వహిస్తారు. వేలాది మంది భక్తులు హజ్రత్ సయ్యద్ ఇంకుషావళి దర్గాను దర్శించుకుంటారు. తమ కష్టాలు తొలిగిపోవాలని, కోరికలు నెరవేరాలని వేడుకుంటూ మొక్కులు చెల్లిస్తారు. వివిధ జిల్లాల నుంచే కాక మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ నుంచి భక్తులు ఉత్సవాలకు హాజరౌతారు.

దర్గా ప్రాశస్త్యం

తెలంగాణలోనే అత్యంత ప్రాశస్త్యమున్న బిజిగిరి షరీఫ్ దర్గాను 11వ శతాబ్దంలో నిర్మించారు. సుమారు 854 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర ఉన్న దర్గాలో హజ్రత్ సయ్యద్ ఇంకుషావళి రహ్మతుల్లాహు అలై, ఆయన సోదరుడైన హజ్రత్ సయ్యద్ అజ్మత్‌షావళి, వారి కుమారులైన హజ్రత్ సయ్యద్ ముర్తుజాషావళి, హజ్రత్ సయ్యద్ అక్బర్‌షావళి సమాధులున్నాయి. ఇస్లాంతోపాటు అల్లాహ్ సందేశాన్ని దివ్య ఖురాన్‌లోని సూక్తులను ప్రజలకు తెలియజేస్తూ.. మధ్యయుగాల కాలంలో అరబ్బు దేశం నుంచి వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ.. మనవత్వమే మతం అని విశ్వమనవ సమానత్వాన్ని చాటుతూ.. బిజిరిషరీఫ్ చేరుకొని దర్గాను నిర్మించుకొని హజ్రత్ సయ్యద్ ఇంకుషావళి ఉన్నాడు. జీవిత కాలంలో ప్రదర్శించిన మహిమలతో ప్రజలకు, బాధితుల పట్ల కరుణ చూపారని, ప్రజలు సుఖశాంతులతో జీవనం గడపగలిగారని మత పెద్దలు తెలిపారు.

భక్తుల నమ్మకం

భక్తి విశ్వాసాలకు చారిత్రక చిహ్నం దర్గాపై భక్తులకు ఎనలేని విశ్వాసముంది. భక్తులు రుగ్మతలు, దీర్ఘకాలిక, మానసిక రోగాలు నయం కావాలని దర్గాలో సమాధుల వద్ద వేడుకుంటారు. ఆరోగ్యం కుదుటపడిన తర్వాత కందుర్తు(న్యాజ్) పేరిట మొక్కులు తీర్చుకుంటారు. కొత్తగూడెంకు చెందిన భక్తుడు కీశే గాజి గోవర్ధన్, మిత్ర బృందం 17 సంవత్సరాల నుంచి ఉర్సు ఉత్సవాలకు హాజరైన భక్తులకు అన్నదానం చేస్తుంటారు.

మూడు రోజులపాటు..

ఉర్సు ఉత్సవాలు హజ్రత్ సయ్యద్ ఇంకుషావళి వర్ధంతి పురస్కరించుకొని ప్రతి ఏటా జిల్ హజ్ మాసంలో నిర్వహిస్తారు. బక్రీద్ సందర్భంగా సోమవారం రాత్రి ముఖ్య ఘట్టమైన సంథల్ షరీఫ్(గంథలేపనం), భక్తులు మేళతాళాలతో ఊరేగింపుగా దర్గాకు చేరుకొని భక్తిశ్రద్ధలతో సమాధులకు చాదర్లను అలంకరింజేస్తారు. మహ్మద్ ప్రవక్త ఉపదేశాలను ఆలపిస్తూ ఖవ్వాలి సమ్మేళనాలు జరుపుతారు. మూడు రోజులపాటు ఉర్సు ఉత్సవాలు జరుపుతామని దర్గా మతావళి మహ్మద్ అక్బర్ అలీ, దర్గా కమిటీ అధ్యక్షుడు మహ్మద్ ఇక్బాల్ తెలిపారు.

బాపే మా మార్గదర్శి





తన తండ్రి సత్తయ్యతో మంత్రి పొన్నం ప్రభాకర్(ఫైల్)

కరీంనగర్ కార్పొరేషన్: నేను పుట్టినప్పుడు మా నివాసం కరీంనగర్‌లోని పాతబజార్. వ్యవసాయ క్షేత్రాలుండడంతో తర్వాత మంకమ్మతోటకు నివాసం మారింది. ఆ వ్యవసాయ క్షేత్రాలను నమ్ముకుని, మమ్మల్ని సమాజంలో గౌరవంగా బతికే విధంగా, తండ్రిగా బాధ్యతలు కొనసాగించారు మా బాపు పొన్నం సత్తయ్య. తనకు, అమ్మకు చదువు రాకున్నా, మేమందరం ఉన్నత విద్యావంతులం కావాలన్న లక్ష్యంతో మా ఇంట్లో అందరం గ్రాడ్యుయేట్లు, పోస్టు గ్రాడ్యుయేట్లు అయ్యేట్లు ప్రోత్సహించారు. ఏ దురలవాట్లు లేకుండా, నలుగురితో మంచిగా ఉండే విధంగా మమ్మల్ని తీర్చిదిద్ది కుటుంబ పెద్దగా తన బాధ్యత నిర్వర్తించడంలోనూ, మాకు మార్గనిర్దేశకం చేయడంలోనూ, సమర్థవంతుడిగా నిలిచాడు. అందుకే మా బాపు సమర్థ నాయకుడు, చిన్నప్పుడు గ్యాస్‌నూనె దీపం క్రింద చదివిన నాడు, ఇంటికి కొత్తగా కరెంటు తీసుకున్న రోజు మా సంతోషంలో పాలుపంచుకోవడం గుర్తు. వార్తలు, మీరు కోరిన పాటలు వినడానికి రేడియో, ఇంకా సైకిల్, యెజ్డీ, టీవీలను కొన్నప్పటి ఆనందం అంతా ఇంతాకాదు. నా కొడుకులు నాదాన్ కాదు కారులో తిరగాలని పాలు, కూరగాయలు, పంట అమ్మడం ద్వారా వచ్చిన డబ్బులతో కారు కొని మార్పుకు శ్రీకారం చుట్టారు. ప్రజలతో సంబంధాలు పెరిగి రాజకీయ రంగ ప్రవేశానికి హోటల్ రవిచంద్ర నాందిగా నిలిచింది. 1986 డిగ్రీ మొదటి సంవత్సరంలో నేను కాలేజీలో విద్యార్థి నాయకుడిగా ఎదిగి, ఎస్ఆర్ఆర్ కళాశాల అధ్యక్షుడిగా ఎన్నికై, తర్వాత ఎన్ఎస్‌యూఐ జిల్లా, రాష్ట్ర నాయకుడిగా ఎదగడానికి మా బాపు ప్రోత్సాహమే. 'చొక్కారావు లాంటి నాయకుని శిష్యరికం తీసుకోరా, మంచి నాయకుడు' అని నేను రాజకీయంగా మరింత ముందుకు వెళ్లడానికి మార్గం చూపించిన మార్గదర్శి మా బాపు. పొన్నం సత్తయ్య కొడుకులు ప్రయోజకులయ్యారని సమాజం అనుకొంటుంటే ం స్వర్గం నుంచి చూస్తూ మా బాపు సంబురపడడమే మా ఆశ.

– పొన్నం ప్రభాకర్,
రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి

ఉర్సు ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన



దర్గాలో మత పెద్దలతో మాట్లాడుతున్న సీఐ రవి

జమ్మికుంట: బిజిగిరిషరీఫ్ దర్గాలో సోమవారం నుంచి నిర్వహించే ఉర్సు ఉత్సవాల ఏర్పాట్లను జమ్మికుంట టౌన్ సీఐ వరగంటి రవి ఆదివారం పరిశీలించారు. ఉత్సవాల ఏర్పాట్లు, భక్తుల సౌకర్యాలను దర్గా కమిటీ, మత పెద్దలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎస్సై రాజేశ్, పోలీసులు పాల్గొన్నారు.

నేత్ర దాత సంస్మరణ సభ



మాట్లాడుతున్న భీష్మాచారి

జమ్మికుంట: పట్టణంలో నేత్ర దాత గుండా తిరుపతయ్య ఇటీవల మృతిచెందగా.. సదాశయ ఫౌండేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు నరహరి ఆధ్వర్యంలో ఆదివారం సంస్మరణ సభ నిర్వహించారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి హాజరై మాట్లాడారు. అవయవ దానం, నేత్రదానం వల్ల ప్రాణ దాతలవుతారన్నారు. సంస్మరణ సభకు హాజరైన బంధుమిత్రులకు అవగాహన కల్పించారు. మృతుడి కుమారులు రాజేంద్రప్రసాద్, ప్రవీణ్‌కు సదాశయ ఫౌండేషన్ అభినందన ప్రతాన్ని అందజేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, సదాశయ ఫౌండేషన్ అధ్యక్షుడు వేణు, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు చందా రాజు పాల్గొన్నారు.

ముగిసిన కరాటే శిక్షణ శిబిరం



శిక్షణ పొందిన విద్యార్థులు

రామడుగు: మండల కేంద్రంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ సామాజిక సేవాసంస్థ రైసింగ్ సన్స్ యూత్ క్లబ్, ఈఏఎఫ్ ఫౌండేషన్, తెలంగాణ అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి కార్యక్రమాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు నిర్వహించిన ఉచిత కరాటే శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం ఆదివారం సాయంత్రం జరిగింది. ఈ శిబిరంలో 25 మంది విద్యార్థులకు శిక్షణ అందించి గ్రీన్, ఆరెంజ్, ఎల్లో బెల్టులను నిర్వాహకులు అందజేశారు. వైస్ ఎంపీపీ పూరెల్ల రాజగోపాల్‌గౌడ్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పంజాల శ్రీనివాస్‌గౌడ్, డాక్టర్ గంగాధర్, నాయకులు బెజ్జంకి అనిల్, కొత్తూరి రాజయ్య, చంటి జితేందర్, నిర్వాహకుడు జెట్టుపల్లి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

బాధితురాలికి ఆర్థిక సాయమందించాలి



పరామర్శిస్తున్న మహిళలు

శంకరపట్నం: కొత్తగట్టు గ్రామంలో ఈనెల 1న అంబాల లక్ష్మి ఉపాధి పనికి వెళ్లగా.. పని ప్రదేశంలో కాలుకు గాయమై తుంటి విరిగింది. గాయమై 15 రోజులు గడుస్తున్నా ఈజీఎస్ అధికారులు చికిత్స అందించడంలో నిర్లక్ష్యం వహించారు. ఆదివారం యూనియన్ నాయకుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్ల రాజు పరామర్శించారు. గ్రామీణ ఉపాధిహామీ చట్టం ప్రకారం ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సాయమందించాలని డిమాండ్ చేశారు. మస్టర్‌లో రోజూవారీగా పనికి హాజరైనట్లు పేరు నమోదు చేయాలని పేర్కొన్నారు. సుశీల, కనకమ్మ, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.



జంగపల్లిలో పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

గన్నేరువరం: జంగపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2002–03 సంవత్సరంలో 10వతరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగ, వ్యాపార, ఇతర విషయాలను పంచుకున్నారు. ఉపాధ్యాయులను శా లువాలతో సన్మానించి మెమెంటోలు అందజేశారు.

సైదాపూర్: మండల కేంద్రంలోని వెన్కేపల్లి ఉన్నత పాఠశాలలో 1989–90 పదోతరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పాఠశాల ఆవరణలో నిర్వహించుకున్నారు. గురువులకు పాదాభివందనం, సన్మానం చేశారు. చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు.

గంగిపల్లిలో ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న కొమురయ్య

మానకొండూర్: గంగిపల్లి గ్రామంలో గొల్ల, కుర్మ యాదవ్ సంఘ ఆత్మీయ సమ్మేళనం సభ ఆదివారం జరిగింది. యాదవులంతా అన్ని రంగాల్లో ముందుండాలని, ప్రభుత్వమిచ్చే సబ్సిడీ రుణాలు, పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సంఘ నాయకులు అన్నారు. ముఖ్యంగా యువకులు విద్య, ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివేకానంద విద్యాసంస్థల చైర్మన్ కొమురయ్యయాదవ్, రామకృష్ణ సీడ్స్ చైర్మన్ చేరాలు, కరీంనగర్ పట్టణ సొసైటీ అధ్యక్షుడు సందబోయిన ప్రసాద్, చెంజర్ల మాజీ ఎంపీటీసీ గడ్డి గణేశ్, బొడ్డు తిరుపతి బనక తిరుపతి, సమ్మయ్య, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గన్నేరువరం: బోనాలతో వెళ్తున్న మహిళలు

పోచమ్మ బోనాలు

గన్నేరువరం: గన్నేరువరంలో ఆదివారం యాదవ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకొని డప్పుచప్పుళ్లతో గ్రామ వీధుల గుండా పోచమ్మ ఆలయానికి చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

శంకరపట్నం: మొలంగూర్ గ్రామంలో మహిళలు పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ముదిరాజ్‌ల ఆరాధ్య దైవమైన పెద్దమ్మ జాతర సందర్భంగా ముదిరాజ్ మహిళలు బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య తరలివెళ్లి పోచమ్మ దేవతకు నైవేద్యం చెల్లించారు.

ఇక 'మహిళా'శక్తి క్యాంటీన్లు

- కలెక్టరేట్, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఏర్పాటుకు సన్నాహాలు
- బస్టాండ్లు, పర్యాటక ప్రాంతాలు, ఆలయాల వద్ద ఏర్పాటు
- తొలి దశలో 10 క్యాంటీన్లు



జిల్లాలో మొత్తం సంఘాలు:	12,468
సభ్యులు:	1,36,536
వీవో సంఘాలు:	527
మండల సమాఖ్యలు:	16
జిల్లా సమాఖ్య:	1
కొత్తగా నమోదైన సంఘాలు:	1,280
సభ్యులు:	11,187

కరీంనగర్ అర్బన్: వ్యాపారాల్లో మహిళలను భాగస్వాములను చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే మహిళా సంఘాల్లో వివిధ ప్రభుత్వ పర కార్యక్రమాల్లో ఉండగా తాజాగా క్యాంటీన్ల నిర్వహణ బాధ్యతలను అప్పగించనుంది. ఇంటిని నడిపే అతివ.. వ్యాపారంలోనూ రాణిస్తుందన్నది సర్కారు భావన. ఈ క్రమంలో వీలైనంత త్వరగా మహిళా శక్తి క్యాంటీన్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించగా జిల్లా యంత్రాంగం తదనుగుణ చర్యలు చేపట్టింది. తొలిదశలో జిల్లాలో 5–10 క్యాంటీన్లు ఏర్పాటు చేయనుండగా మహిళా సంఘాలే వాటిని నిర్వహించనున్నాయి.

పలు వ్యాపారాల్లో మహిళల సత్తా

మూడు దశాబ్దాల క్రితం మహిళా సంఘాలు ఏర్పడగా మహిళలు స్వయం ఉపాధితో పాటు ఆర్థిక నిర్వహణ చేసేలా చర్యలుండేవి. ప్రభుత్వాలు కాలక్రమేణా వ్యాపారాల్లో భాగస్వామ్యం చేశాయి. జనరిక్ మందుల దుకాణ నిర్వహణ, ధాన్యం కొనుగోళ్లు, వ్యవసాయ యంత్రాలు అద్దె నిర్వహణ, సూపర్‌మార్కెట్లు, టైలరింగ్ వంటి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. వచ్చిన లాభాలను సంఘంలోనే జమ చేస్తూ అవసరమున్నవారికి అతి తక్కువ వడ్డీకి అందజేస్తూ మహిళలు నిలదొక్కుకునేలా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మహిళా శక్తి క్యాంటీన్లు తెరపైకి రాగా కలెక్టరేట్‌తో పాటు కరీంనగర్, హుజూరాబాద్ బస్టాండ్, కరీంనగర్, జమ్మికుంట రైల్వేస్టేషన్ వంటి ప్రాంతాల్లో క్యాంటీన్లను ఏర్పాటు చేయాలని అధికారులు సూత్రప్రాయంగా నిర్ణయించారు. ఆలయాలు, పర్యాటక ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు స్థలాలను పరిశీలిస్తున్నారు. అయితే బిహార్, కేరళ రాష్ట్రాల్లో మహిళలే క్యాంటీన్లను నిర్వహిస్తుండగా గతంలో ప్రభుత్వం అధ్యయనం చేసిన సంగతి తెలిసిందే. సదరు ఫలితాల క్రమంలోనే రాష్ట్రంలో మహిళా శక్తి క్యాంటీన్లకు తెరలేపారు.

నమూనా ఒకటే.. రాయితీపై వంట సామగ్రి

మహిళాశక్తి క్యాంటీన్లను ఒకే నమూనాతో ఏర్పాటు చేయనున్నారు. క్యాంటీన్ల పనివేళలు, ఏఏ ఆహార పదార్థాలు విక్రయించాలి, ప్రధానంగా తెలంగాణ వంటలు, పిండి పదార్థాలకు ప్రాధాన్యతనివ్వనున్నారు. కలెక్టరేట్, ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిర్వహించే క్యాంటీన్లు కార్యాలయాల పనివేళలకు అనుగుణంగా నడవనుండగా ఇతర ప్రాంతాల్లోని క్యాంటీన్లు నిత్యం అందుబాటులో ఉంటాయి. ఇక వంట సామగ్రి, షెడ్ ఏర్పాటు వంటి వాటికి రాయితీపై ఇవ్వనున్నారు.

కార్యవర్గం ఎన్నిక



యాదవ సంఘం సభ్యులు

జమ్మికుంట: కోరపల్లి యాదవ కులస్తుల ఆధ్వర్యంలో అఖిల భారత యాదవ సంఘం కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బక్కతట్ల శ్రీనివాస్‌యాదవ్, ఉపాధ్యక్షుడిగా గిరవేన శంకర్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా నల్లగాశ నరేశ్, కోశాధికారిగా గిరవేన శ్రీనివాస్‌యాదవ్, ప్రచార కార్యదర్శులుగా కూకట్ల కుమార్, గిరవేన సమ్మయ్య, సహాయ కార్యదర్శులుగా గిరవేన కుమార్, గిరవేన కొమురయ్య, సంయుక్త కార్యదర్శులుగా గిరవేన అయిలయ్య, గిరవేన రంజిత్, సభ్యులు ఎన్నికయ్యారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు.

'ప్రజా సమస్యలు పరిష్కరించడంలో విఫలం'

చొప్పదండి: అధికారంలోకి వచ్చి ఆరు నెలలు దాటినా ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ముఖ్యమంత్రి విఫలమయ్యారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మినారాయణ విమర్శించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చాలామంది రైతులు పట్టాదారు పాసు పుస్తకాలు రాక ఆందోళన పడుతుంటే కళ్లకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య నందిస్తామని చెప్పి పాఠశాలల్లో కనీసం స్వీపర్లు, అటెండర్లను కూడా నియమించడం లేదన్నారు. గత ప్రభుత్వం పేదవారికిచ్చిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను వెంటనే పూర్తి చేసి అందించాలని కోరారు. మాజీ సీఎం ఫొటోలున్న పుస్తకాలను తనిఖీ చేయకుండా పంపిణీ చేయడం విడ్డూరమన్నారు.

బీఎస్పీలో చేరిక

శంకరపట్నం: మొలంగూర్ గ్రామానికి చెందిన ఎండీ యూనిష్ ఆదివారం కరీంనగర్ బీఎస్పీ కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిషాని రాంచంద్రం సమక్షంలో బీఎస్పీలో చేరారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులున్నారు.